సర్వజన సురక్ష



మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన
- 9 శిబిరాల్లో 6,237 మందికి ఓపీ సేవలు
- నగరంలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు

కాకినాడ క్రైం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదింటి వరంగా మారింది. సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రావడంతో పేదలతో పాటు నిరుపేద, మధ్యతరగతి రోగులకు ఊరట చేకూరింది. ప్రతి వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది.

వచ్చే నెల 21 వరకు..

కాకినాడ నగరంలో ఈ నెల 4 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభమయ్యాయి. నవంబర్ 21 వరకూ ఎంపిక చేసిన ప్రాంతాల్లో నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో జరగనున్నాయి. ప్రతి వైద్య శిబిరానికి కనీసం ఐదుగురు సూపర్‌స్పెషాలిటీ వైద్యులు హాజరవుతున్నారు. రోగులను పరీక్షించి, మందులిచ్చి వారి ఆరోగ్య పరిస్థితి మేరకు అవసరమైన వారిని ఉన్నత ఆరోగ్య కేంద్రాలకు సిఫార్సు చేస్తున్నారు. తద్వారా వైద్యసాయాన్ని పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ నిర్వహణ కోసం కలెక్టర్ కృతిక శుక్లా సహా ప్రత్యేక పర్యవేక్షణ బృందం పనిచేస్తోంది. ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ కదలి సత్యనారాయణను నియమించారు. ఆయన ఆధ్వర్యంలో బృందం.. శిబిరాలకు వచ్చే రోగులకు తగిన రీతిలో సేవలు అందేలా చర్యలు తీసుకుంటోంది. మొత్తం ప్రక్రియను డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షిస్తున్నారు.

9 రోజుల్లో ఇవీ గణాంకాలు..

నగరంలో మొత్తం శిబిరాలు	-9
నమోదైన ఓపీ	- 6,237
పురుషులు	- 2,524
మహిళలు	- 3,713
ఉన్నత ఆరోగ్య కేంద్రాలకు సిఫార్సు చేయబడిన వారు	- 122



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీ గీత, ఇతర నాయకులు

6,237 మందికి లబ్ధి

కాకినాడ నగరం పరిధిలో ఈ నెల 4 నుంచి జగనన్న ఆరోగ్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఈ సేవలను యూపీహెచ్‌సీ ప్రకాశం వీధి వేదికగా లాంఛనంగా ప్రారంభించారు. నాటి నుంచి 9 రోజుల వ్యవధిలో జట్ల పెదకాపు వీధి, కేబీ కాలనీ, ప్రకాశం వీధి, రేచర్లపేట, రెవెన్యూ కాలనీ, సంజయ్‌నగర్, సీతారామనగర్, ఎన్టీఆర్ నగర్ నార్త్ వింగ్–2 , నరసింహ రోడ్డు–2 పరిధిలో మొత్తం 9 వైద్య శిబిరాలు జరిగాయి. శిబిరానికి 693 మంది సగటున మొత్తం 6,237 ఓపీ నమోదైంది. వీరందరికీ ఉచితంగా ఔషధాలను పంపిణీ చేశారు.

కంటి వైద్య సేవలకు విశేష స్పందన

మల్టీ స్పెషాలిటీ పరిష్కారాలతో జగనన్న ఆరోగ్య



వైద్య శిబిరంలో సేవలు పొందుతున్న వృద్ధురాలు

వైద్య శిబిరాలు ఎనలేని సేవలందిస్తున్నాయి. అంధత్వం, పాక్షిక అంధత్వంతో ఇల్లు దాటలేకపోయిన ఎందరో.. గడప సమీపానికే వచ్చిన శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. కంటి వైద్య సేవలకు రెండు ప్రత్యేక ఓపీ విభాగాలు ఏర్పాటు చేయాల్సినంత తాకిడి ఉందని డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. కంటి సేవల స్థానంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థో, దంత వైద్య సేవలున్నాయి. ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండడంతో ప్రతి సచివాలయం పరిధిలో ఒక్కో శిబిరాన్ని నిర్వహించాలని కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు ఇచ్చింది.

ఇకపై ఎక్కడెక్కడంటే..

నగరంలో అన్ని సచివాలయాల పరిధిలో శిబిరాలు జరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అందుకు తగ్గట్టుగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కాకినాడ నగరంలో పీహెచ్‌సీ/యూహెచ్‌సీల్లో నిర్ణీత సచివాలయం పరిధిలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇవీ..

24/10/23న యూపీహెచ్‌సీ ప్రతాప్ నగర్–2
25/10/23న యూపీహెచ్‌సీ ప్రతాప్ నగర్–3
27/10/23న యూపీహెచ్‌సీ రామారావుపేట–2
30/10/23న యూపీహెచ్‌సీ రెల్లిపేట–2
31/10/23న యూపీహెచ్‌సీ రెల్లిపేట–3
01/11/23న యూపీహెచ్‌సీ రామారావుపేట–3
02/11/23న యూపీహెచ్‌సీ సీతారామనగర్–2
03/11/23న యూపీహెచ్‌సీ సీతారామనగర్–3
04/11/23న యూపీహెచ్‌సీ రెవెన్యూకాలనీ–2
06/11/23న యూపీహెచ్‌సీ సంజయ్‌నగర్–2
07/11/23న యూపీహెచ్‌సీ కొండబాబు కాలనీ–2
08/11/23న యూపీహెచ్‌సీ నేతాజీ పార్కు–2
09/11/23న యూపీహెచ్‌సీ నేతాజీ పార్కు–3

విశేషమైన ఆదరణ



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి నగరంలో ఈ స్థాయి స్పందన వస్తుందని ఊహించలేదు. జనం తాకిడికి నిర్ణీత షెడ్యూల్‌ను సైతం మార్చాల్సి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో విస్తరిస్తున్నాం. కంటి వైద్య సేవలకు ఎనలేని స్పందన లభిస్తోంది. వందల్లో ఓపీలు నమోదవుతున్నాయి. మందులను సైతం ఉచితంగా అందిస్తున్నాం. ఈ నెల 28 వరకు కొనసాగాల్సిన శిబిరాలు విశేష ప్రజాదరణ నేపథ్యంలో వచ్చే నెల 21 వరకూ కొనసాగించనున్నాం. వచ్చే నెల 9 వరకు 15 చోట్ల నిర్వహణకు షెడ్యూల్ సిద్ధం చేశాం.

– డాక్టర్ కదలి సత్యనారాయణ, ప్రోగ్రాం అధికారి, జగనన్న ఆరోగ్య సురక్ష, కాకినాడ నగరం

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

కరప: ఆర్థికభారం లేకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పెద్దాపురప్పాడులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం గ్రామాల నుంచి 402 మంది వైద్యశిబిరంలో నమోదు చేయించుకున్నారు. డాక్టర్ ఈ.సింధూర, డాక్టర్ పి.ఆశ, ఇతర వైద్య బృందంతో సేవలందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పౌష్టికాహార స్టాళ్లు ఏర్పాటుచేశారు. రోగులకు మందుల కిట్లను అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొండా చంటిబాబు, ఉపసర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, విజయరాయుడుపాలెం సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, కాదా వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి డి.దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



పేషెంట్లకు మందుల కిట్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

కానిస్టేబుల్ భార్యకు ఆర్థికసాయం



కానిస్టేబుల్ భార్య సురేఖకు ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ పిల్లి వేణు ఇటీవల మరణించడంతో.. ఆయన భార్య సురేఖకు రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అధికారులు అందజేశారు. కాకినాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బసవ శ్రీనివాసరావు ఈ ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల ఆందోళన

బోట్‌క్లబ్: తక్షణమే సెప్టెంబర్ నెల జీతాలు చెల్లించాలని కోరుతూ కాకినాడ నగర పాలక సంస్థ క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహన డ్రైవర్లు శుక్రవారం ఉదయం జగన్నాథపురం వాహనాల యార్డు వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్ల జీతాలు 20 తేదీనాటికీ చెల్లించకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు

కాకినాడ క్రైం : కాకినాడలో శుక్రవారం పలు స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆదేశాలమేరకు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐవో) డాక్టర్ కె.రత్నకుమార్ ఈ తనిఖీలు జరిపారు. స్కానింగ్ నిర్వహణ తీరు, రికార్డులు పరిశీలించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా స్కానింగ్ సెంటర్లకు వచ్చిన వారికి అవగాహన కల్పించారు.

ఇద్దరికి జేఎన్‌టీయూకే పీహెచ్‌డీలు



విజయచంద్ర



యువరాజు

బాలాజీ చెరువు: జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఇద్దరికి పీహెచ్‌డీలు జారీ చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. డిజైన్ రీకాన్ఫిగరబుల్ యాంటెన్నాస్ ఫర్ కాగ్నిటివ్ రేడియో అప్లికేషన్స్ అంశంపై కె.విజయచంద్ర సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ ప్రకటించారు. అలాగే జియోస్పేషియల్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టూల్స్ ఫర్ డీసీజ్ ప్యాటర్న్ డిఫ్యూసన్ అనాలసిస్ అండ్ మ్యాపింగ్ అనే అంశంపై సీహెచ్ యువరాజు రచించిన సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ లభించింది.

బీసీలకు అండగా ముఖ్యమంత్రి జగన్



శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రాయుడుపాలెంలో నిర్మిస్తున్న శెట్టిబలిజ కల్యాణ మండపానికి శంకుస్థాపన

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అండగా ఉన్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కార్పొరేషన్ల ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కాకినాడ రూరల్ రాయుడుపాలెంలో శెట్టిబలిజ కల్యాణ మండపం నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు నియోజకవర్గంలోని చీడిగ, అర్బన్‌లోని 49వ డివిజన్‌లో, కరప, కూరాడ, తూరంగి తదితర చోట్ల జరుగుతున్నాయని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఆయా వర్గాల వారికి పెద్ద ఎత్తున కమ్యూనిటీ భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. అత్యధికంగా బీసీలు ఉన్న ప్రాంతంలో భవనాల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చామన్నారు. రాయుడుపాలెంలో త్వరలోనే భవనం అందుబాటులోకి తెస్తామన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకరరావు, బీసీ నాయకులు రాయుడు నాగేశ్వరరావు, విత్తనాల రమణ, మట్టపర్తి రాజు, పలంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు లింగం రవి, జంగా గగారిన్, పార్టీ రమణయ్యపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, శెట్టిబలిజ సంఘ జిల్లా నాయకుడు కండవల్లి రమణ పాల్గొన్నారు.

సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలన

కాకినాడ: బాల్య వివాహాల నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి సంబంధింత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేషన్, మెప్మా, ఐసీడీఎస్, విద్యా శాఖ అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. కాకినాడ వంటి నగరాల్లో కూడా సరైన అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమన్నారు. రెండేళ్ల వరకూ జైలు, రూ.లక్ష జరిమానా ఉంటుందన్నారు. ఈ విషయంలో మతపెద్దలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీనిపై డివిజన్ల వారీగా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఫంక్షన్లు, కమ్యూనిటీ హాళ్ల వద్ద బాల్య వివాహాల నిషేధానికి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ మాట్లాడుతూ బాల్యవివాహాలపై బోర్డులు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, టీపీఆర్‌ఓ కృష్ణమోహన్, మెప్మా అధికారి డి.వెంకటరాజు ఎంఈఓ రవి, ఇన్‌చార్జి సీడీపీఓ జ్యోతి పాల్గొన్నారు.

సమష్టి బాధ్యతతోనే దేశ సమగ్రత



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

కరప: దేశ ఐక్యత, సమగ్రత కాపాడటంలో సమష్టి బాధ్యత అవసరమని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం జిల్లా నెహ్రూ యువకేంద్రం (తాళ్లరేవు బ్లాక్) ఆధ్వర్యంలో ఒకే భారతం, శ్రేష్ఠ భారతం నినాదంతో నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ కె.అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అమరవీరుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలన్నారు. మండలంలోని 23 పంచాయతీల నుంచి కార్యదర్శులు, వలంటీర్ల ద్వారా సేకరించిన మట్టిని నింపిన అమృత కలశాలతో ర్యాలీ నిర్వహించారు. పలు దేశభక్తి నినాదాలు చేశారు. ఈ మట్టితో ఢిల్లీలో ఈనెల 30, 31 తేదీల్లో ప్రధాని నాయకత్వంలో అమృత వనం, స్థూపాన్ని ఏర్పాటు చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. నెహ్రూ యువకేంద్రం తాళ్లరేవు బ్లాక్ ప్రతినిధి జి.సత్తిబాబు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి రామారావు, పలివెల నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనుబాబు, ఎంపీటీసీ సభ్యులు అనసూరి శ్రీనివాసరావు, కె.కామేశ్వరరావు, వై.ప్రశాంతి, సీహెచ్ చంటిబాబు పాల్గొన్నారు.

మురుగు నిల్వ లేకుండా చూడాలి

కాకినాడ రూరల్: దోమల నిర్మూలనకు డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని డీఎం అండ్ హెచ్‌ఓ జె.నరసింహ నాయక్ కోరారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా కాకినాడ మూడో డివిజన్‌లోని సురేష్ నగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. కార్పొరేషన్ పబ్లిక్‌హెల్త్, సచివాలయ ఎన్విరాన్‌మెంట్ అసిస్టెంట్లతో కలిసి డ్రైనేజీలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విషజ్వరాలు రాకుండా ఉండేందుకు దోమలు వ్యాప్తిని అరికట్టాలన్నారు. వారానికోసారి నిల్వ నీరు పారబోసి, పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగుదొడ్ల గాలి గొట్టాలకు మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీల్లో చెత్తా చెదారం లేకుండా చూడాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్ రామారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, బి.మౌనిక పాల్గొన్నారు.



కరప శివాలయంలో సింహారోహణ అవతారంగా పర్వతవర్థినీదేవి



కరపలో రూ.20 నోట్లమాలతో అలంకృతులైన దుర్గాదేవి అమ్మవారు




రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో సరస్వతీ దేవి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో కాళికాదేవి అలంకరణలో..



సరస్వతీదేవి అలంకరణలో అయ్యప్పస్వామి ఆలయంలోని కామాక్షి అమ్మవారు



కరెన్సీ నోట్లతో అలంకృతులైన భ్రమరాంబ అమ్మవారు

ఊరూ వాడా.. దసరా సందడి

- చిన్నారులతో సామూహిక సరస్వతీ పూజలు

కాకినాడ రూరల్: దసరా వేడుకలతో గ్రామాల్లో సందడి నెలకొంది. దేవీ శరన్నవరాత్రుల ఆరో రోజైన శుక్రవారం అమ్మవారు భక్తులకు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రీతికరమైన మూలా నక్షత్రం కావడంతో చిన్నారులతో ఆలయాల్లో సరస్వతి పూజలు నిర్వహించారు. కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో పూర్ణనంద స్వామి చిన్నారులతో సరస్వతీ పూజలు చేయించి, ఆశీర్వచనాలు అందించారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో కనకదుర్గ అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. మహిళలతో కుంకుమ పూజలు జరిపించారు. శేషాద్రినగర్‌లో బాలకనక దుర్గమ్మ ఆలయం వద్ద చిన్నారులతో సరస్వతీ పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ లింగం రవి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో కాకినాడ రూరల్ నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

సింహారోహణ అవతారంలో పర్వతవర్థినీదేవి

కరప: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కరప శివాలయంలోని పర్వతవర్థినీదేవి అమ్మవారు సింహారోహణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో దుర్గాదేవిని ప్రత్యేకంగా అలకరించి, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూలా నక్షత్రం కావడంతో అమ్మవారిని సరస్వతీదేవి అవతారంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచే అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి, కుంకుమ పూజలో పాల్గొన్నారు. కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని రూ.20లనోట్ల మాలతో అలంకరించి, అర్చకుడు కొంపెల్ల చక్రధర్ అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. పెనుగుదురు శివాలయంలో తుమ్మలపల్లి శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. వేణుగోపాలస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ, సరస్వతి బాలభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో అర్చకులు గోవర్ధనం సూర్యనారాయణాచార్యులు సామూహిక సరస్వతీదేవి పూజ చేయించారు. ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు, గ్రామ ప్రముఖులు టి.లక్ష్మణరావు, బి.మురళి, బి.సతీష్ తదితరులు విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కరప శివాలయంలో పర్వతవర్థినీదేవిని సింహారోహణ అవతారంగా అలంకరించి ప్రధాన అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. కరప మార్కెట్‌యార్డు వద్ద దుర్గాదేవికి పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు పూజలు చేశారు. విద్యార్థులతో సరస్వతీదేవి పూజ చేయించారు.



శ్రీపీఠంలో సరస్వతి పూజ విశిష్టతను తెలుపుతున్న పరిపూర్ణనంద సరస్వతి

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజైన శుక్రవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయంలో సింహారోహణం అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గాయత్రి గానలహరి ఆధ్వర్యంలో కీర్తనలు, సత్కళావాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి కీర్తనలు భక్తులను అలరించాయి. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో లలితా పారాయణ, నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. సరస్వతీ పూజలో సుమారు రెండు వేల మంది చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ట్రెజరర్ కర్రి చినబాబు పాల్గొన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు కాళికాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రిజర్వ్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. విద్యార్థులు సామూహిక సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ వారికి పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక విద్యుత్‌నగర్ వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపంలో సామూహిక కుంకుమ పూజలు, విద్యార్థులకు సరస్వతీ పూజలు నిర్వహించారు.



యండమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో విద్యార్థుల సామూహిక పూజలు



రమణయ్యపేట శేషాద్రినగర్‌లో బాలకనక దుర్గమ్మ ఆలయంలో చిన్నారులను ఆశీర్వదిస్తున్న కురసాల సత్యనారాయణ

రూ.5 లక్షలతో అమ్మవారి అలంకరణ

కరప: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అరట్లకట్ట గ్రామంలో వేంచేసిన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారిని రూ.5 లక్షల కరెన్సీతో అలంకరించారు. అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మి రూపంలో అలంకరించి, అర్చకుడు కొంతేటి శివకుమార్‌శర్మ పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ, భక్తబృందం ఆధ్వర్యంలో రూ.5 లక్షల కరెన్సీతో మహాలక్ష్మి అమ్మవారుగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే దంపతుల పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు

బోట్‌క్లబ్: సంతచెరువు కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన ఈ ఆలయం సర్వాంగ సుందరంగా ఉందని ఆలయ నిర్మాణదాత జొన్నాడ చినబాబును అభినందించారు. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, చైర్మన్ పెద్ది రత్నాజీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత రామలింగేశ్వరస్వామివారికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

ఏటా సరస్వతీ పూజలు అభినందనీయం



సరస్వతీ పూజల్లో పాల్గొన్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏటా సరస్వతీ పూజలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. ఆలయంలో శుక్రవారం వేలాది మంది విద్యార్థులతో నిర్వహించిన సరస్వతీ పూజలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏటా విద్యార్థులకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి పాల్గొన్నారు.